# ఎపెండిసైటిస్

రామారావు కడుపునొప్పితో ఉంగరాలు చుట్టుకు పోతున్నాడు.

గింగరాలు తిరుగుతున్నాడు.

'ఎపెండిసైటిస్'

డాక్టరు అన్నాడు.

గంటలో ఆపరేషన్ అయిపోవాలి.

అర్ధరాత్రి!

సుందరరావు డ్యూటీ డాక్టరు.

సర్జన్‌కోసం కబురు పంపాడు.

ఊళ్లో లేడు!

మరో డాక్టరు వచ్చే అవకాశం లేదు.

సుందరరావు—ఆపరేషన్ చేయగల్డు. అర్హత పొందాడు.

గంటలో ఆపరేషన్ జరిగి తీరాలి.

చేస్తే . . .

రోగి బ్రతికిపోవచ్చు!

చేయకపోతే . . .

'. . . . . . . . .'

డాక్టర్ సుందరరావు సిద్ధమయ్యాడు.

అంతా సిద్ధమయింది.

రామారావు కడుపునొప్పి!

కళ్లు బైర్లు క్రమ్ముతున్నాయి.

డాక్టరును ఎక్కడో చూచినట్లు గుర్తు!

ఇరవై ఏళ్ల సర్వీసులో ఎక్కడో, ఎప్పుడో స్టూడెంట్ అయి వుండవచ్చు!

అడుగుదామనుకొన్నాడు.

అడగలేదు.

స్టూడెంట్ లెక్చరరును బాగా గుర్తుపట్టగల్డు!

తను పొరపాటు పడవచ్చు!

కడుపునొప్పి!

విపరీతంగా బాధ!!!

అందువల్ల

రామారావు అడగలేదు.

ఫిజిక్స్ లెక్చరరు రామారావును ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకుపోయారు.

ఎక్కడో చూచినట్లు గుర్తు!

డాక్టర్ సుందరరావు బాగా పరిచితుడు!

గుర్తు రావటంలేదు.

థియేటర్‌లో డాక్టరు సుందరరావు.

కెమిస్ట్రీ లాబొరేటరీలో పొలిటిక్స్ స్టూడెంటులా.

విద్యార్థినీ సంఘం మధ్య విద్యార్థిలా.

రైల్లో టిక్కెట్టులేని ప్రయాణికుడిలా.

అదోమాదిరిగా ఉన్నాడు.

ఎనెస్తిషియా ఇచ్చేందుకు సిద్ధమయ్యే డాక్టర్‌ను చూడగానే రామారావుకు గుర్తు వచ్చింది.

ఆ వేసవిలో . . .

మధ్యాహ్నం—

మండుటెండలో . . .

అందమయిన కారు! కాలిపోతూ వచ్చి ఇంటిముందాగింది. అందులోంచి, విశాల దేహం వెలుపలికి వచ్చింది.

ప్రక్కనే పల్చటి యువకుడు.

'నమస్కారం!'

'నమస్కారం!'

'వీడు మావాడు సుందరరావు.'

'రైట్!'

'ఇంటర్ రాశాడు!'

'రైట్!'

'ఫిజిక్స్‌లో పాసవుతాడు. తక్కువ వస్తాయి మార్కులు.'

'రైట్!'

'మీదగ్గర ఫిజిక్స్ పేపర్సు!'

'రైట్!'

'ఇదిగో నంబరు వీడికి ఎనభై అయిదు మార్కులు, మీకు వేయిరూపాయలు.'

రామారావు మాట్లాడలేదు.

యువకుడు కూర్చున్నాడు.

విశాల దేహం కూర్చుంది.

యువకుడు మూడు గంటలు — వ్రాతపని చూచి వ్రాత —డిక్టేషన్—బాగా వ్రాశాడు.

రామారావు డబ్బు జేబులో పెట్టుకొంటూ అడిగాడు.

'ఎందుకన్ని మార్కులు?'

'డాక్టరు చదవాలి.'

'మిగతా సబ్జక్ట్స్.'

'పని పూర్తయింది.'

గతం గతించింది.

'కడుపునొప్పి!'

విపరీతంగా కడుపునొప్పి!

రామారావు భరించలేక పోతున్నాడు.

'డాక్టర్!'

'ఊఁ!'

'నీ పేరు సుందరరావు కదూ!'

'అవును—మీరు?'

రామారావు మాట్లాడలేదు. గుండె బలహీనంగా కొట్టుకుంటూ వుంది. చెమటపడుతూ వుంది. మత్తెక్కుతూ వుంది.

'నేను — నేను — రామారావుని — ఫిజిక్స్ లెక్చరర్‌ని — ఇంటర్‌కి—అప్పుడు—ఎగ్జామినర్‌ని' గొణిగినట్టుంది. ఏమి వినిపించలేదు.

డాక్టర్ సుందరరావు రామారావు కడుపు కోస్తున్నాడు.